క్లుప్తంగా

అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే సీజ్ చేస్తాం

వేములవాడ: వేములవాడ మూలవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే సీజ్ చేస్తామని తహసీల్దార్ మహేశ్, వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ హెచ్చరించారు. సోమవారం పలు వివరాలు వెల్లడించారు. మూలవాగు నుంచి ఇసుకను తీయడాన్ని మల్లారం, జయవరం గ్రామాల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. మూలవాగులోంచి ఇసుకను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు మొరపెట్టుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండా ఇసుకను తీస్తే కేసులు పెడతామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పనులకు నిబంధనల మేరకే అనుమతులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



వేములవాడ/ వేములవాడ అర్బన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని విరుపాక్షి గార్డెన్‌లో ఆ దివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీల్లో పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 12 వెండి, 8 కాంస్య పతకాలతో పాటు గోల్డ్ పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను డీఈవో రమేశ్‌కుమార్, కరాటే మాస్టర్ అస్సియా, పద్మజ, స్వప్న, అబ్దుల్ మన్నాన్, ఉపాధ్యాయులు అభినందించారు.

పరామర్శ

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తీపిరెడ్డి లక్ష్మారెడ్డి, కోనరావుపేటకు చెందిన దండు సంజయ్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. ఆయనవెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణీ, నాయకులు గోపాల్, తాళ్లపల్లి ప్రభాకర్, లింబయ్య తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కోనరావుపేట: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండలంలోని నిజామాబాద్, కనగర్తి, సుద్దాల గ్రామాల్లో పర్యటిస్తారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫి రోజ్‌పాషా తెలిపారు. ఆయాగ్రామాల్లో ఏర్పా టు చేసిన కృతజ్ఞతా ర్యాలీల్లో, సమావేశాల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: ప్రస్తుతం కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తున్నందునా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు కోరారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే దేశంలో కరోనా కేసులు 4వేలకు చేరాయని, ప్రజలు తప్పకుండా మాస్కులు ధరించాలని సూచించారు. కొత్త వైరస్ ప్రమాదకరంగా ఉందన్నారు. న్యూఇయర్ వేడుకల సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, మండల పరిషత్ వైస్‌చైర్మన్ కదిరె భాస్కర్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బాల్‌రెడ్డి ఉన్నారు.

అనారోగ్యంతో పంపు ఆపరేటర్ మృతి

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలో గత పదిహేనేళ్లుగా పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న కరికే యాదగిరి(57) సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరా లు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న యాదగిరి సోమవారం మృతిచెందాడు. మృతుడు యాదగిరికి భార్య వజ్రవ్వ, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ దినకర్. ఎంపీటీసీ అరుణ్‌కుమార్ కోరారు.



యాదగిరి (ఫైల్)

ట్రాక్టర్ బోల్తా

తంగళ్లపల్లి: బస్వాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ గ్రామ శివారులో బోల్తా పడింది. గ్రామంలో చెత్త సేకరణచేసి డంపు యా ర్డుకు తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

వృద్ధులకు మిషన్లు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో చెవులు వినపడని వృద్ధులకు జిల్లా సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన చెవిటి మిషన్లను సోమవారం సర్పంచ్ గణప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న అందజేశారు. కార్యక్రమంలో బండి పెద్ద మల్లయ్య, ఒగ్గు మల్లయ్య, నాయకులు లింగం తదితరులు పాల్గొన్నారు.



వీర్నపల్లి : క్రైస్తవుల ఆటాపాట..

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఉదయమే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్‌చేశారు. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేములవాడ రూరల్ మండలం శాత్రాజుపల్లి, వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి, తిప్పాపూర్ చర్చి, చందుర్తి మండలం మూడపల్లిలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



వేములవాడరూరల్: శాత్రాజుపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



కోనరావుపేట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



ముస్తాబాద్‌లో..



తంగళ్లపల్లి: పద్మనగర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



వేములవాడ : మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీ నరసింహారావు



గంభీరావుపేట: వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



బోయినపల్లి: తడగొండ చర్చిలో ప్రార్థనలు

ప్రభుత్వ ఉద్యోగులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: గిరిజన తండా నుంచి కష్టపడి పలువురు యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. లక్ష్యంతో ముందుకుపోతే అన్ని సాధించవచ్చని నేటి సమాజానికి తెలియజేశారు. కొందరు క్రీడల్లో రాణిస్తుంటే.. మరికొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతను సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం సన్మానించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం తండాకు చెందిన భూక్య రాజు, భూక్య చిన్నరాజు, ముడావత్ వెంకటేశ్ పోలీస్ ఉద్యోగం సాధించగా, జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా ముడావత్ సౌజన్య, ముడావత్ వనజ కొలువుదీరారు. బాక్సింగ్‌లో రాష్ట్రస్థాయిలో బానోతు హరిచంద్రప్రసాద్ ప్రథమ బహుమతి సాధించారు. ఇలా ప్రభుత్వ ఉద్యోగాలు, ఆటల్లో ప్రతిభ కనబర్చిన వారిని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సన్మానించారు. సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్ మాట్లాడుతూ మాములు మారుమూల తండా నుంచి యువతీయువకులు సర్కార్ కొలువులు కొట్టడం అభినందనీయమన్నారు. ఉపసర్పంచ్ సుద్దాల బాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో ట్రాక్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లద్దునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వంగల రాజు, కోశాధికారిగా దేవేందర్‌ను ఎన్నుకున్నారు.

అలంకారప్రాయంగా రైతు వేదికలు



మర్రిపల్లిలో నిరుపయోగంగా రైతువేదిక



కుంగిన రైతు వేదిక ఫ్లోరింగ్

- నాసిరకం పనులతో నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

వేములవాడరూరల్: గ్రామాల్లో రైతుల కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు వేదికలను నిర్మించింది. కొన్ని గ్రామాలను కలుపుకుని ఈ రైతు వేదికలను దాదాపు రూ.20 లక్షలతో నిర్మాణం చేపట్టారు. కానీ చాలా గ్రామాల్లో నిర్మించిన ఈ రైతు వేదికలను ఉపయోగించుకోకుండా వదిలిపెట్టడంతో నిరుపయోగంగా మారాయి. వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి, హన్మాజిపేట, శాత్రాజుపల్లి గ్రామాల్లో నిర్మించారు. వీటిలో అడపదడపా సమావేశాలు తప్ప అందులో వ్యవసాయ అధికారులు ఉన్న దాఖలాలు లేవు. రైతులకు వ్యవసాయ శాఖ అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు ఆశాఖ అధికారి రైతుల కోసం సలహాలు, సూచనలు ఇచ్చే విధంగా క్లస్టర్ రైతు వేదికలు ఉపయోగపడుతాయనే ఉద్దేశంతో నిర్మించారు. కానీ చాలాగ్రామాల్లో సంబంధిత శాఖ అధికారులు అందులో రైతులకు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి. గతేడాది 2022 మార్చి 5న ప్రారంభించిన ఈ వ్యవసాయ క్లస్టర్ రైతు వేదిక నాణ్యత లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో కుంగిపోతున్నాయి.

మందుబాబులకు అడ్డాగా..

రైతులకు అందుబాటులో ఉండాలని గ్రామాల్లో నిర్మించిన క్లస్టర్ రైతు వేదికలు మద్యం ప్రియులకు అడ్డాగా మారాయి. గ్రామ శివారులో నిర్మించిన ఈ రైతు వేదికలను పట్టించుకునే అధికారులు లేకపోవడంతో దుమ్ము ధూళితో నిండిపోయాయి. రాత్రి సమయాల్లో కొందరు మందుబాబులకు ఈ వేదికలు అడ్డాగా మారాయి. రైతు వేదిక పరిసర ప్రాంతాల్లో మద్యం బాటిళ్లతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రాములోరి అక్షింతలతో శోభాయాత్ర

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో అయోధ్య నుంచి వచ్చిన శ్రీ రాముల వారి అక్షింతలను గ్రామంలో సోమవారం రాత్రి శోభాయాత్రగా ఊరేగించారు. గ్రామస్తులు ముందుగా అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మార్కండేయ ఆలయం నుంచి శ్రీకేశవ పెమాండ్ల ఆలయం వరకు అక్షింతలను శోభాయాత్రగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, ఎంపీటీసీ ఇల్లందుల గీతాంజలి, ఉపసర్పంచ్ హేమలత, నాయకులు బాపురెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ, కిషన్, బీమేశ్వర్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో అయోధ్య రాములవారి ఆలయ అక్షింతల కలశాలను ఊరేగించారు. శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, సుధాకర్ రెడ్డి, దేవేందర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



చీకోడులో రాములవారి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

గంభీరావుపేట: మండలకేంద్రంలో సోమవారం అయ్యప్పస్వామి భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

విరాళం అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామంలోని సింగారం స్వచ్ఛంద సేవాసంస్థకు బాల సాహితీవేత్త డాక్టర్ వాసరవేని పర్శరాములు సోమవారం రూ.10వేల విరాళంగా అందజేశారు. సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు, గ్రంథాలయాలు నిర్వహిస్తున్నారు. వాటి నిర్వహణకు తనవంతు విరాళం అందించారు. అధ్యక్షుడు కోల నారాయణ, ఉపాధ్యక్షుడు రామచంద్రం, తిరుపతి, వాసరవేని పర్శరాములు, ప్రధాన కార్యదర్శి షేక్ ఉస్మాన్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు బాలయ్య, అంజయ్య, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధికేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 27, 28న నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ సబ్ డివిజన్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ రాము తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని గ్రామాలు, మున్సిపాలిటీలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోయినపల్లి: మండలకేంద్రానికి చెందిన అనంతుల రాజు కుటుంబానికి యువమిత్ర యూ త్‌క్లబ్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. రూ.5వేలతో పాటు నిత్యావసర సరుకులు, దుప్పట్లు అందించారు.

బియ్యం వితరణ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల 36వ వార్డుకు చెందిన పట్నం సక్కుబాయ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబానికి కౌన్సిలర్ కల్లూరి రాజు సోమవారం 50కిలోల బియ్యం అందించారు. వార్డు పెద్దలు వెంకటేశ్, నర్సయ్య, అంబదాసు, లక్ష్మీరాజం, మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకట రమణరెడ్డి మండలంలోని తాళ్లపల్లి మల్లన్న జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీని సన్మానించి స్వామివారి ఫొటోను అందించారు. మాజీ ఎంపీపీ ఐలయ్య యాదవ్, మానకొండూర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వెంకటి, సర్పంచ్ కరుణ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలోని జంగంరెడ్డి పల్లె గ్రామ యూత్ సభ్యులకు సోమవారం సర్పంచ్ శ్రీలత నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లు, టీషర్ట్స్ పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ ఎల్లయ్య, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి రెడ్డి సంఘం (రెడ్డి జన సమితి తంగళ్లపల్లి) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ఎడమల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంజీవ రెడ్డి, సహాయ కార్యదర్శిగా బాల్ లింగారెడ్డి, కోశాధికారిగా జయరాం రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా భూపాల్ రెడ్డి, మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి వ్యవహరించారు.

నిర్మించారు.. వదిలేశారు

- శ్మశానవాటికల్లో నీరు, విద్యుత్ సౌకర్యాలు కరువు
- ఊరికి దూరంగా ఉండటంతో వెళ్లని ప్రజలు
- రూ.లక్షలు వెచ్చించినా నిరుపయోగం
- వీర్నపల్లి మండలంలో పరిస్థితి



బాపుసింగ్‌నాయక్ తండాలో కిందపడిన వైకుంఠధామం గేట్లు



ఇది వీర్నపల్లి మండలంలోని భూక్యతండా శ్మశానవాటిక. భూక్యతండా, రాశిగుట్టతండాకు రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని నిర్మించడంతో వినియోగంలోకి రావడం లేదు. అక్కడికి వెళ్లాలంటే రోడ్డు సరిగా లేదు. వైకుంఠధామంలో నీరు, విద్యుత్ సౌకర్యాలు లేవు.

వీర్నపల్లి: అంతిమ సంస్కారాలు గౌరవంగా నిర్వహించేందుకు నిర్మించిన శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలైన నీరు, కరెంట్ లేవు. గ్రామాలకు దూరంగా నిర్మించడంతో అంతదూరం వెళ్లలేక తమ తమ పొలాల్లోనే దహనసంస్కారాలు నిర్వహిస్తున్నారు. వీర్నపల్లి మండలంలోని 17 గ్రామాల్లో ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద ఒక్కోదానికి రూ.12.50 లక్షలు వెచ్చించి, శ్మశానవాటికలు నిర్మించింది. కానీ, ఇప్పటివరకు ఒక్కటీ వినియోగంలోకి రాలేదు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నాసిరకం పనులు

వైకుంఠధామాలను కొన్ని గ్రామాల్లో అడవికి సమీపంలో, గుట్టల దగ్గర నిర్మించారు. నాసిరకం పనుల కారణంగా గోడలకు పగుళ్లు రావడం, చిన్నపాటి గాలికే రేకులు ఊడిపోతున్నాయని ప్రజలు అంటున్నారు. లాల్‌సింగ్‌తండా, బాబాయ్ చెరువు తండా, వీర్నపల్లి, ఎర్రగడ్డ తండా, కంచర్ల గ్రామాల్లోని శ్మశానవాటికలకు కరెంట్ సౌకర్యం లేదు. ఇక్కడ సోలార్ ఏర్పాట్ల పనులు కొనసాగుతున్నాయి.

ప్రహరీలు, సీసీరోడ్లు నిర్మించలే..

శ్మశానవాటికలకు ప్రహరీలు, సీసీరోడ్లు నిర్మించలేదు. వాటి నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం పంచాయతీ అధికారులకు అప్పగించింది. కానీ, నిధులు లేకపోవడంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి, శ్మశానవాటికల్లో వసతులు కల్పించి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నీరు, విద్యుత్ లేవు



గ్రామాల్లో వైకుంఠధామాల పనులు పూర్తయినప్పటికీ నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. దీంతో అవి ఉపయోగంలోకి రా వడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి, శ్మశానవాటికల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– పోటి దినకర్, సర్పంచ్, వీర్నపల్లి

వినియోగించుకోవాలి



వీర్నపల్లి మండలంలో వైకుంఠధామాల పనులు పూర్తయ్యాయి. ఊరికి దూరంగా ఉండటం, కుటుంబంలో మరణించిన వ్యక్తి జ్ఞాపకార్థం ప్రజలు తమ పొలాల్లోనే దహనసంస్కారాలు చేస్తున్నారు. శ్మశానవాటికలను వినియోగించుకోవాలి.

– నరేశ్‌కుమార్, ఎంపీడీవో, వీర్నపల్లి

నేడు అయ్యప్ప మహా పడిపూజ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌లో శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మండల మహాపడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల నుంచి అయ్యప్ప మాలధారులు, భక్తులు అధికసంఖ్యలో రానుండగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 26న ఉదయం 4గంటలకు స్వామివారి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 4.30 గంటలకు నగర సంకీర్తన, 5.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, గణపతి హవనం, 7.30 గంటలకు పల్లకిలో గ్రామ పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు, 10గంటలకు స్వామివారికి అష్టాభిషేక పూజలు నిర్వహించనున్నట్లు గురుస్వాములు శ్రీను, నాగెల్లి ఇంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారి ఆభరణాల ఊరేగింపు, 6గంటలకు దీపారాధన, ముస్తాబాద్ రాజు గురుస్వామి కరకములతో రాత్రి 7 గంటల నుంచి మహా పడిపూజ, మహాహారతి, రాత్రి 10గంటలకు హరివరాసనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.



ముస్తాబైన అయ్యప్ప ఆలయం

అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న ప్రవీణ్

వేములవాడ రూరల్: స్వచ్ఛంద స్థాపించిన 12 ఏళ్లలో ఆపదలో ఉన్నవారికి యాభైసార్లు రక్తదానం అందించిన స్ఫూర్తి సంస్థ చైర్మన్ రోమాల ప్రవీణ్‌కు నేషనల్ బంగారు నంది అవార్డు అందుకున్నట్లు ఆయన సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన రోమాల ప్రవీణ్‌కు జాతీయ బంగారు నంది అవార్డు అందించిన సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతను సోమనినేని బాలు, గ్రామస్తులు అభినందించారు.

కేబినెట్‌లో బంజారాలకు ప్రాతినిధ్యం కల్పించాలి



ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ప్రభుత్వం తమ కేబినెట్‌లో బంజారాలకు ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు గిరి జనశాఖను బంజారాలకు కేటాయించాలని ఆలిండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు అజ్మీరా రాజునాయక్ కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బంజారాలకు ప్రస్తుత ప్రభుత్వం తగిన గుర్తింపునివ్వడంతోపాటు వారి శాఖలకు బంజా రాలనే నియమించాలన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఫిబ్రవరి 15న ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని, ఆరోజు సెలవుగా ప్రకటించాలని కోరారు. సర్పంచులు భూక్యశంకర్ నాయక్, భూక్య ప్రభునాయక్, పెంటయ్యనాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అజ్మీరా తిరుపతినా యక్, సీత్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.